



### జరిగిన జగన్నాటకం

ఎడమ చేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడిచేతి పోరాటానికి మహాబసు అనే నాయకుడయ్యాడు సారథి. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం తెలుసుకున్నాడు. దళాధిపతి దాడిలో సుధాముడు మరణించాడు. రహస్య మార్గం ద్వారా రాజప్రాసాదంలో వామదేవుణ్ణి కలిసాడు మహాబసు. తానే ఆచార్య వేదాంతం అని డాక్టర్ నరసింహం చెప్పాడు. దళాధిపతి దాడిలో వామదేవుడు మరణించాడు. మహాబసు మరణించాడని నమ్మి ఉద్యమాన్ని ఆపేయాలన్న ప్రయత్నం చేస్తున్న ద్వీపకు మరణ శిక్ష విధించాడు ఉగ్ర. యుద్ధంలో ఉగ్రని నిరాయుధుణ్ణి చేసిన దళాధిపతి అతణ్ణి చంపడానికి కత్తి దూశాడు.

- 28 –

కోటని సమీపిస్తుండగానే గోడపైన, బురుజులపైన నిలబడుతున్న సైనికులు కనిపించారు. ముఖద్వారం దగ్గర వున్న బురుజు మీదకే ఎక్కాడు మహాబసు. ఎక్కగానే కోట లోపలికి చూసి స్థాణువులా నిలబడిపోయాడు.

కోట ముఖద్వారం దాటగానే వృత్తాకార కూడలి వుంటుంది. ఆ ప్రదేశంలోనే ఆహ్వాన శిల్పాలు నిలబెట్టి వుంటాయి. అక్కడ వందల సంఖ్యలో నిలబడి వున్నారు – వామదేవుడి సైనికులు. వారందరి ముందు నిలబడి వున్నాడు వాళ్ళ నాయకుడు – ఉదంతుడు. ఏ ఒక్కరి చేతిలోనూ ఆయుధాలు లేవు. కత్తులు, బాణాలు ఆఖరికి డాలుని కూడా కింద పడేసి వున్నారు. అదేది కాదు మహాబసుని ఆశ్చర్యపరిచింది. వాళ్ళందరూ చేతులు జోడించి వున్నారు. వేడుకుంటున్నారు.

కోటగోడ పైన చూశాడు. సైనికులంతా తమ తమ స్థానాలలో రెండు వరసలుగా నిలబడ్డారు. ముందు వరుస మోకాళ్ళపై కూర్చోగా, వెనుక వరుసలో వున్న సైనికులు నిలబడ్డారు. అందరూ తమ తమ విల్లంబులు నిలబెట్టి, బాణాలని వాటి పైకి ఎక్కించారు.

హాహాకారాలు మొదలయ్యాయి వామదేవుడి సైన్యం నుంచి. మరణభయంతో వాళ్ళు చేస్తున్న ఆర్తనాదాలవి. కాపాడమంటూ వాళ్ళు అరుస్తున్న వేడుకోళ్ళవి.

బాధ, కోపం రెండూ ఒకేసారి కలిగాయి మహాబసు. తన సైన్యాన్ని కాపాడమని ఆఖరి కోరికగా కోరుకున్న వామదేవుడి ముఖం గుర్తుకొచ్చింది.

“ఉగ్రా” బెబ్బులిలా అరిచాడు.

ఆ అరుపుకి అటు కోట పైన నిల్చున్న సైన్యం, ఇటు కోట కింద రాజమార్గం కూడలిలో నిలబడ్డ సైన్యం కూడా అదిరిపడ్డారు. రెండు బురుజుల అవతల వున్నాడు ఉగ్ర.

“సైనికులారా! గురి పెట్టండి” ఆజ్ఞాపించాడు ఉగ్ర.

“ఆగండి...” అరిచాడు మహాబసు. “ఉగ్రా... ఆగు...” అరుస్తూ ముందుకు పరుగెట్టాడు.

ఉగ్ర రెండగులు అతని వైపు వేసే లోగా అతని దగ్గరకు చేరాడు మహాబసు.

“ఏమిటి నువ్వు చేస్తున్న పని?” అడిగాడు కోపంగా.

“శతృవినాశనం. మనకి వ్యతిరేకంగా పోరాడిన ఏ ఒక్కడి శ్వాస ఈ గాలిలో కలవడం కూడా నాకు ఇష్టం లేదు.” కరకుగా సమాధానం చెప్పాడు.

“వీళ్ళు మనకి శత్రువులు కారు ఉగ్రా”

ఆ మాట వింటూనే గట్టిగా నవ్వాడు ఉగ్ర.

“ఏమంటున్నావు మహాబసు... వీళ్ళంతా వామదేవుడి సైన్యం. వీళ్ళు మనకి శత్రువులు కాదని అంటున్నావా? అదిగో మిమ్మల్ని అపహరించిన ఉదంతుడు”

“ఉదంతుడు నన్ను అపహరించలేదు. కాపాడాడు”

“మీకేమైనా మతి భ్రమించి మహాబసూ... మన ఉద్యమానికి వెన్నుపోటు పొడిచి, మిమ్మల్ని వామదేవుడికి బందీగా తీసుకెళ్ళిన విషయం మర్చిపోయారా?” అంతకంతకూ ఉగ్ర గొంతు తీవ్రమౌతోంది. చుట్టూ ఉన్న సైనికులు వాళ్ళిద్దరి వాదన చూస్తూ ఉండిపోయారు.

“సైనికులారా ఎక్కుపెట్టండి” అన్నాడు ఉగ్ర మళ్ళీ.

“వద్దు. ఆగండి” మహాబసు మళ్ళీ అరిచాడు.

“మహాబసూ... నేను ఏం చెయ్యాలో అది చెయ్యనివ్వకుండా ఆటంకపరుస్తున్నావు”

"అవును. కానీ ఏం చెయ్యకూడదో అది చేస్తావేమో అన్న భయంతోనే ఇదంతా చేస్తున్నాను. ఉదంతుడు ద్రోహి కాదు. వామదేవుడు మన శత్రువు కాదు.."

"ఏమన్నావ్? ఇప్పటి వరకూ ఉదంతుడు శత్రువు కాదన్నావ్. ఇప్పుడు వామదేవుడే శత్రువు కాదంటున్నావు. నీకు మతి చలించిందనడానికి ఇంతకన్నా హేతువు ఇంకేం కావాలి?"

"నా గురించి నువ్వేమనుకున్నా ఫర్లేదు. నేను ఇప్పుడు బ్రతికి వున్నానంటే అందుకు కారణం ఉదంతుడు, వామదేవుడు – ఈ ఇద్దరే. నా ప్రాణానికి తన ప్రాణం అడ్డం వేసి చనిపోయాడు వామదేవుడు. చనిపోయే ముందు ఈ సైనికుల ప్రాణాలను కాపాడతానని నా నుంచి వాగ్దానం తీసుకున్నాడు"

మళ్ళీ నవ్వాడు ఉగ్ర. "శత్రువుకి ఇచ్చిన వాగ్దానం." ఇంకా నవ్వుతూనే వున్నాడు.

"చూడు మహాబసూ... ఒక వేళ నువ్వు చెప్పిందే నిజమే అనుకుందాం. అయినా ఆ కనపడుతున్న సైనికులలో ప్రతి ఒక్కడు నా సైన్యంలో కనీసం ఒకడిని చంపి వుంటాడు. నా అనుచరుల రక్తానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత వాళ్ళ మీద లేదంటావా?" అడిగాడు మహాబసుకి దగ్గరగా వచ్చి.

"వాళ్ళు చంపడం నిజమే కానీ అది ఒక ఆజ్ఞని అనుసరించి జరిగాయి. అనివార్యమైతేనే చంపారు తప్ప అవి హత్యలు కావు. నేరం అంతకన్నా కాదు"

"అయితే నా అనుచరుల ప్రాణాలకు ఎలాంటి విలువ లేదంటావా? అందుకు ప్రతీకారం తీర్చుకోవద్దంటావా?"

"యుద్ధంలో ఎవరు మరణించాలో ఎవరూ నిర్దేశించలేరు. అలాంటి శిక్షనే వెయ్యాలనుకుంటే సైనికుల మధ్య యుద్ధం జరగనియ్. యుద్ధంలో నీకు చేతనైనంతమందిని చంపు. కాదనను. కానీ ఇలా ఆయుధాలు లేని నిరాశ్రయుల్ని వేటాడినట్లు చంపడం ధర్మం కాదు"

"ఎందుకు కాదు. యుద్ధం ముగిసింది. ఇప్పుడు వాళ్ళు యుద్ధ ఖైదీలు. నేను విధిస్తున్నది శిక్ష."

"శిక్ష విధించడానికి నువ్వెవరు?"

"ఓహో అక్కడిదాకా వచ్చిందా? ఈ ప్రశ్న నేను ఈ ఉద్యమాన్ని నడిపినప్పుడు అడగలేదే? నువ్వు లేనప్పుడు నాయకత్వం వహించి పోరాటాన్ని ముందుకు నడిపినప్పుడు ఈ ప్రశ్న రాలేదే? ఇప్పుడు యుద్ధంలో విజయం సిద్ధించిన తరువాత ఈ ప్రశ్న అడుగుతున్నావంటే నీ రాజ్య కాంక్ష, స్వార్థం తెలుస్తూనే వుంది."

"ఉగ్రా... పిచ్చి, పిచ్చిగా మాట్లాడకు. వామదేవుడికి నేనిచ్చిన వాగ్దానం కోసం తపన పడుతున్నాను తప్ప, నువ్వనుకుంటున్నట్లు నాకు ఎలాంటి రాజ్య కాంక్ష లేదు"

"నీ కాంక్షలతో నాకు ఎలాంటి సంబంధం లేదు మహాబసు. ఈ విజయం తరువాత నువ్వు కాదనుకుంటే ఇక నేనే ఉత్తరాధికారిని. అ అధికారంతో చెప్తున్నాను. శత్రుశేషం వుండటానికి వీల్లేదు." అంటూనే సైనికులకు ఉత్తర్వులు జారీ చేశాడు. "సైనికులారా, సిద్ధం కండి"

అనుకోని విధంగా అందులోఒక సైనికుడు ఉగ్ర వైపు తిరిగాడు. వయసులో పెద్దవాడు కానీ బలిష్టంగా వున్నాడు.

"దేవరా! మహాబసు చెప్పింది ఆలకించండి. చేతిలో ఆయుధం లేని వాడు చంపద్దని దణ్ణం పెడుతుంటే బాణం విడవడానికి చేతులు రావట్లేదు" అన్నాడు.

"చేతులు రాని వాళ్ళంతా పక్కకు తప్పుకోవచ్చు. ఆజ్ఞను అతిక్రమించిన నేరానికి ఆ చేతులనే కోల్పోవాల్సివస్తుందని గుర్తుపెట్టుకోండి" ఉగ్ర బెదిరించాడు.

"ఆ సైనికుడికి వున్నంత ఆలోచన కూడా నీకు లేకపోవడం విచారకరం ఉగ్ర. ఈ తప్పు చెయ్యకు. సవ్యలంక చరిత్రలో నేరస్థుడిగా మిగిలిపోకు."

"చరిత్రతో నాకు సంబంధం లేదు. నాకు తెలిసింది ఒకటే ఆజ్ఞా పాలన, రాజ్య విధేయత లేని వాళ్ళు ఎవరైనా నేరస్థుడే. నా ఆజ్ఞను అమలు కానివ్వకుండా అడ్డుకుంటున్నందుకు నిన్ను కూడా బంధించగలను" మహాబసు వైపు వేలు చూపించాడు ఉగ్ర.

మహాబసు చిన్నగా నవ్వాడు. తన ఖడ్గాన్ని జారవిడిచాడు.

"అయితే ఇదిగో... నీ ఆజ్ఞను నేను ఉల్లంఘిస్తున్నాను. ఆ సైనికులకి అండగా నేను నిలబడతాను. వాళ్ళ ముందు నిలబడతాను. మీ బాణం ఏదైనా నన్ను దాటుకోని వాళ్ళని చేరుకోవాలి. నన్ను చంపి ఆ తరువాత వాళ్ళని చంపండి." అంటూ బురుజు దిగే మెట్ల వైపు నడవసాగాడు.

అప్పుడు జరిగిన అనూహ్య సంఘటనకి అందరూ అవాక్కయ్యారు.

ఉగ్ర ఒక్కసారిగా ముందుకు దూకి మహాబసు చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకున్నాడు. తన కత్తిని అతని మెడపైన వుంచాడు.

"ఆజ్ఞోల్లంఘన దేవుడు చేసినా సహించేది లేదు. సైనికులారా బంధించండి" అరిచాడు. ఏ ఒక్క సైనికుడు ముందుకు రాలేదు.

"మిమ్మల్నే... నువ్వు... నువ్వు.. నువ్వు... నువ్వు" అంటూ ఒక్కరిని అజ్ఞాపించాడు. ఉగ్ర ఆజ్ఞను అందుకున్న నలుగురు నిస్సహాయస్థితిలో ముందుకు వచ్చారు. మహాబసుని పట్టుకున్నారు. అతను ప్రతిఘటిచలేదు.

"ఉగ్రా... వద్దు... ఇంతటి ఘోరానికి పాల్పడకు... ఈ తప్పుకి నిన్ను ఎవరూ క్షమించరు..." అంటూనే వున్నాడు మహాబసు. సైనికులు అతన్ని గొలుసులతో బంధించారు.

"గొలుసులను కోట బురుజుకి కట్టండి. జరగబోయే శత్రు సంహారం అతను కూడా చూడాలి. ఇది సవ్యలంక ప్రజల సేవకే తప్ప యుద్ధ కాంక్షతో కాదని అతనికి అర్థం కావాలి" ఉగ్ర ఆజ్ఞాపించాడు.

మహాబసు వద్దని వారిస్తూనే వున్నాడు. అతన్ని కోట బురుజుకి కట్టారు.

"సైనికులారా... గురి చూడండి" మళ్ళీ ఆజ్ఞాపించాడు ఉగ్ర.

అప్పటి దాకా జరుగుతున్న వాదనని వింటూ, మహాబసునే బంధించడం ఆశ్చర్యంతో చూస్తున్న ఉదంతుడు, అతని సేన ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మళ్ళీ ప్రాణభయం ఉబికి వచ్చింది.

"వద్దు... కాపాడండి... రక్షించండి..." అన్న అరుపులతో ఆ కోట మొత్తం ప్రతిధ్వనించింది.

"సైనికులారా సిద్ధం" ఉగ్ర మళ్ళి అరిచాడు. వింటి నారిని వెనక్కి లాగి పట్టుకున్నారు సైనికులందరు.

ఇంక ఒక్క ఆదేశం వస్తే చాలు.

వందలాది మంది ప్రాణానికి మృత్యువుకి మధ్య ఒక్క ఆదేశం.

అప్పుడు గమనించాడు మహాబసు. బాణం విడవడానికి సిద్ధంగా వున్న సైనికులందరి కళ్ళలో నీళ్ళు. కొందరు బాహాటంగానే ఏడుస్తున్నారు. మరికొందరు కళ్ళు మూసుకోని వున్నారు.

"నీకు వామదేవుడికి తేడా లేదు ఉగ్రా.." అన్నాడు మహాబసు. ఉగ్ర కోపంగా అతని వైపు చూశాడు.

"చూడు... నీ ఆజ్ఞను పాటించడానికి నీ సైనికులు పడుతున్న వ్యధని చూడు. ఇష్టం లేకపోయినా ప్రాణాలను తీస్తున్నందకు వాళ్ళు ఎంత మధనపడుతున్నారో చూడు. కేవలం నీ అధికారాన్ని చెలాయించడానికి నువ్వు చేస్తున్న మారకాండకి, ఎడమచేతి వాటాన్ని ఒక చట్టంగా అమలు చెయ్యాలనుకున్న సవ్యలంక మహాధిపతుల ప్రయత్నానికి పెద్దగా తేడా వుందంటావా? అప్పుడు వామదేవుడి సైనికులు కూడా ఇలాగే ఆజ్ఞాపాలనం చెయ్యడం కోసం మన సైనికుల్ని చంపారు. అప్పుడు వాళ్ళు కూడా ఇలాగే వ్యధ చెంది వుంటారు. ఇప్పుడు నీ ఆజ్ఞాపాలన కోసం ఆ సైనికుల్ని చంపడానికి వీళ్ళు అలాగే ఏడుస్తున్నారు... ఏమిటి మనం సాధించింది? ఒక నియంతని తొలగించి ఇంకొక నియంతని నిలబెడుతున్నామా?"

మహాబసు ఆఖరి మాటకి ఉగ్ర ముఖం వివర్ణమైంది. ఏం చెప్పాలో అర్థం కాని స్థితిలో అరిచాడు —

"సైనికులారా... శరాలని విడువండి"

మహాబసు ఉగ్రని చూడలేదు. బాణాలను విడవడానికి సిద్ధపడిన సైనికులని చూడలేదు. అతని చూస్తున్నది — కోట బురుజు కన్నా ఎత్తుగా ఎగసిన అలని. సముద్రం పొంగి కోటదాకా వచ్చింది.

జలప్రళయం!

ఉగ్ర ఆదేశం ఇచ్చిన మరుక్షణం ఆ అల కోటగోడ పైన పడింది. బాణాలు వదిలారా? లేదా? తెలియలేదు. నీళ్ళు మొత్తం కమ్మేయడం మాత్రం అర్థం అయ్యింది మహాబసుకి. బంధించిన గొలుసుల్ని విడిపించుకునే ప్రయత్నం చేశాడు. అది అసాధ్యమని అర్థమైపోయింది. నోటి గుండా, శ్వాస ద్వారా శరీరంలోకి చేరుతున్న ఉప్పునీటిని గమనిస్తూ వుండిపోయాడు. కొంతసేపటికి స్పృహ తప్పింది

★★★

నల్లగా వున్నాడతను. కానీ ముఖంలో తేజస్సు. చూస్తున్నకొద్దీ చూడాలనిపించేలా వున్నాడు. మనోహరంగా వున్నాడు. ఎవరు?

ఎవరో తెలుసు. తెలుస్తోంది. కానీ గుర్తుకురావటంలేదు.

నల్లనివాడు.

ఆ కళ్ళు... వికసించిన పద్మాలలా. పద్మ నయనంబుల వాడు.

"పరమాత్మా" అన్నాడు సంభ్రమంగా చేతులు జోడించి.

అలా ఎంతసేపు వున్నాడో తెలియదు. తెలియలేదు. ఆశ్చర్యం. భక్తి. తాదాత్మ్యత. ఇహమో పరమో తెలియని అలౌకిక అనుభూతి.

"ఏమిటయ్యా? నిన్ను అందరూ దేవుడంటుంటే నాకు నమస్కరిస్తున్నావు?" అన్నాడాయన.

"నేను దేవుణ్ణేమిటి దేవ దేవా...?"

"అయితే నేనెవరో తెలుస్తోందన్న మాట. నీకేదో మాయ కమ్మిందనీ, ఏదీ గుర్తులేదనీ అన్నారే..."

ఒక్క క్షణం తడబడ్డాడు మహాబసు.

"అవును స్వామీ, నేను ఎవరో ఎందుకు ఇక్కడ వున్నానో తెలియలేదని.." అంటూ చుట్టూ చూశాడు. అతను ఇప్పుడు వున్నది సవ్యలంకలో కాదు. సముద్రం అడుగున. చుట్టూ నీరు. నీలం రంగులో. ఆశ్చర్యంగా నీలమేఘశ్యాముణ్ణి చూశాడు.

"నువ్వు ఎవరైతేనేమయ్యా? ఏందుకు సవ్యలంక చేరావో ఇప్పటికే తెలిసిపోయిందిగా?"

"ఈ యుద్ధం జరపించడానికా? ఇన్ని ప్రాణాలను బలి చెయ్యడానికా? ఎందుకయ్యా ఇంత నాటకం ఆడించావు? ఇంత యుద్ధం జరిపించావు?" అడిగాడు

"యుద్ధం నేను జరిపించడం ఏమిటి మహాబసు? యుద్ధం జరిపించింది నువ్వు కదా?" శ్రీకృష్ణుడు అమాయకంగా అడిగాడు.

"నీ ఆజ్ఞ లేకుండానే ఇంత యుద్ధం జరిగిందా స్వామీ? ధర్మ రక్షణ కోసం యుద్ధం చెయ్యమని ఆ నాడు అర్జునిడికి ప్రబోధించావు. ఈ రోజు నన్ను ప్రేరేరింపించావు. కానీ అధర్మంగా ఆ ఉగ్ర అంతమందిని హతమారుస్తుంటే ఆపనివ్వకుండా వెనక్కి తీసుకొచ్చావు. మళ్ళీ స్పృహ వచ్చేసరికి అక్కడే వుంటానుగా?"

"ఏమో మరి" అంటూ మనోహరంగా నవ్వాడు సమ్మోహను

"కనీసం అక్కడ ఏం జరగబోతోందో చెప్పు స్వామీ. ఉగ్ర వాళ్ళందరినీ చంపేస్తాడా? వేదాంతం, ద్వీప వీళ్ళంతా ఏమైపోతారు? సవ్యలంక రాజ్యానికి ఉత్తరాధికారి ఎవరు? జలప్రళయంలో ఎవరు చనిపోబోతున్నారు? ఎందుకు స్వామీ ఇంతమందిని సంహరించే సందర్భాన్ని తీసుకొచ్చావు? సమాధానం ఇచ్చే అవకాశం కూడా ఆయనకు ఇవ్వకుండా అడిగాడు మహాబసు.

"నేను ఇంతమందిని సంహరిస్తున్నానా? ఉగ్ర చంపేస్తున్నాడా? ఏం? నీ ఆధ్వర్యంలో ఎంతమంది చనిపోయారో మర్చిపోయావా?" అన్నాడు అలాగే నవ్వుతూ.

"నేను చేసిన పోరాటం ధర్మ రక్షణ కోసం కదా?"

"ఏ ధర్మం?"

"అంటే?"

"సమయ కాలాదుల బట్టి మీరిద్దరూ చెరొక విధంగా ధర్మాన్ని నిర్మించుకున్నారు. అప్పుడు నువ్వు చెప్పే ధర్మం నీ దృష్టిలో సరైనది కావచ్చు. ఇప్పుడు ఉగ్ర చెయ్యబోతున్న పని అతని దృష్టిలో సరైనది కూడా అయ్యిండచ్చు కదా?"

సమాధానం చెప్పలేక అలాగే వుండిపోయాడు మహాబసు. సమాధానాలు చాలా వున్నాయి. కానీ శ్రీకృష్ణుడి వాదనని తర్కంతో ఎదిరించగల సమాధానం అతనికి స్ఫురించ లేదు.

"నిజమే. నాకు ఏది సబబు అనిపిస్తే అదే చేశాను. అదే విషయం కోసం పోరాడాను. అది అలాగే యుద్ధంగా పరిణమించింది. ఇదంతా చూస్తే అసలు ఎందుకు చేశానా అనిపిస్తోంది. ఎందుకు స్వామీ నన్ను ఈ ద్వీపానికి తీసుకొచ్చారు.?" అన్నాడు మోకాళ్లపైన పడి

"అదేం మాటయ్యా? వీళ్ళందరికీ ఒక దేవుడు వస్తాడన్న నమ్మకం వుంది. ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన అవసరం వుంది"

"అయితే మీరే ఏదో అవతారం ఎత్తి రావచ్చు కదా?"

"వచ్చాను కదా?"

"ఎవరిగా?"

"నీలాగా"

స్థాణువులా వుండిపోయాడు మహాబసు.

"స్వామీ... ఏమిటి మీరనేది?" అడిగాడు ఆశ్చర్యంగా

"మరి నువ్వు, నేను ఒకటే కదా? అవునులే. నీ పేరుని నువ్వే మర్చిపోయావు కదూ... పార్థసారథి?"

పా... ర్థ... సా... ర... థి...

★★★

పా... ర్థ... సా... ర... థి...

"మిస్టర్ పార్థసారథి"

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు సారథి.

"మిస్టర్ సారథి... ఆర్ యూ ఆల్ రైట్"

ఏదో హాస్పిటల్... మందుల వాసన.

"ఎలా వుంది మీకు?" ఎవరిదో పరిచయమైన కంఠం పలకరించింది. డాక్టర్. ముఖానికి గుడ్డ కట్టి వుండటం వల్ల కళ్లు కనపడుతున్నాయి తప్ప అది ఎవరో అర్థం కాలేదతనికి.

"డాక్టర్ నరసింహం?" అడిగాడు

"డాక్టర్ నరసింహమా? ఆయన ఎవరు?" పక్కనే వున్న మరో డాక్టర్ అడిగాడు.

"నన్ను ట్రీట్ చేసింది ఆయనే కదా?"

"మిస్టర్ సారథీ... మీరింకా పూర్తిగా కోలుకోలేదు. మిమ్మల్ని ట్రీట్ చేసిన వాళ్ళలో నరసింహం అనేవాళ్ళు ఎవరూ లేరు" డాక్టర్ చెప్పిన విషయం విన్న తరువాత ఇంకా తికమకపడ్డాడు సారథి

"ఇంతకీ నాకు వచ్చిన సమస్య ఏంటి?" అడిగాడు.

డాక్టర్ దగ్గరగా వచ్చి ముఖానికి వున్న మాస్క్ తీసి చెప్పసాగింది.

"డ్రగ్ ఓవర్ డోస్... ఆ తరువాత దాని వల్ల ఏవో పిచ్చి పిచ్చి ఊహలు. డ్రగ్ ఇండ్యూస్డ్ హాలూజినేషన్ అంటారు... దాంట్లో చాలా తీవ్ర స్థాయికి వెళ్ళారు. ఏదో ఏదో ఊహించుకోని, ఆ ఎమోషన్ లోనే... బట్ ఫర్గెట్ ఎబౌట్ ఇట్. ఇప్పుడు మీరు నార్మల్ అయిపోయారు.. ఓకే..."

ఆమె చెప్పేది ఏదీ వినటం లేదు సారథి.

ఆమె ముఖాన్నే చూస్తున్నాడు.

"ద్వీప" అన్నాడు అప్రయత్నంగా

"నో... డాక్టర్ దీప" నవ్వి వెళ్ళిపోయిందామె. సారథి చిన్నగా నవ్వి కళ్ళు మూసుకున్నాడు. **(జగన్నాటకం ముగిసింది)**

# జగన్నాటక సూత్రధారులు

నేను నవల రాయగలనని నమ్మి రాయమని సూచించి, ప్రచురించిన శ్రీ కిరణ్ ప్రభ గారికి – నెలనెల ఇస్తానో ఇవ్వనో అనే సస్పెన్స్ థ్రిల్లర్ ఇచ్చాను.

ఈ కథకు మూలమైన ఒకానొక చర్చ మొదలుపెట్టిన శ్రీమతి దగ్గర్నుంచి – నెలాఖరు వారాంతాలు లాగేసుకున్నాను.

రెండొందల పేజీల నవలను నడిపేంత స్ఫూర్తి నిచ్చే పాట రాసిన సీతారామశాస్త్రి గారికి, వారి పదాలనే నవల పేరు చేసి కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

చదివి, ఆనందించిన పాఠకులకు, అభినందించిన ఆత్మీయులకు – మళ్ళీ మరో నవలతో కలుస్తాను. ప్రామిస్.

COMMENTS